సాక్షి నిజామాబాద్

ఆదివారం । 5 । ఫిబ్రవరి । 2023



ధర్మాన్ని రక్షించాలి

ధర్మాన్ని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని రామచంద్ర జీయర్ స్వామీజీ పేర్కొన్నారు. డిచ్‌పల్లి రామాలయాన్ని సందర్శించారు.

- 8లో ▸



11న లోక్ అదాలత్‌లు

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 11న లోక్ అదాలత్‌లను నిర్వహించనున్నట్లు మొదటి అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు తెలిపారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.4 /15.4

వాతావరణం

పొగ మంచు కురుస్తుంది. ఈదురు గాలులు వీస్తాయి. చలితీవ్రత పెరిగే అకాశం ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రంలో రాబోయేది బీజేపీ సర్కారే..



సుభాష్‌నగర్ : రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ ప్రభుత్వమే ఏర్పడుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. శనివారం అర్బన్ నియోజకవర్గంలోని వినాయక్‌నగర్, ఖిల్లా రాంమందిర్, కంఠేశ్వర్ మండలాల కార్యవర్గ సమావేశాలను వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 10 నుంచి 25 వరకు శక్తి కేంద్రాల వారీగా శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్‌లను నిర్వహించాలని రాష్ట్ర అధ్యక్షుడు పిలుపునిచ్చారని, జిల్లాలో 350 శక్తికేంద్రాల కార్నర్ సభలు నిర్వహిస్తామన్నారు.కేంద్ర పథకాలను బూత్‌స్థాయి వరకు తీసుకెళ్లాలని, ఆ బాధ్యత కార్యకర్తలదేనని తెలిపారు. రూ. లక్షల కోట్ల అవినీతికి పాల్పడిన కల్వకుంట్ల కుటుంబాన్ని గద్దె దించే వరకూ బీజేపీ పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సుక్కమధు, రోషన్‌లాల్ బోరా, లక్ష్మీనారాయణ, స్వామి యాదవ్, నారాయణ యాదవ్, పంచరెడ్డి లింగం, శ్రీధర్‌రెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

అదనపు జిల్లా జడ్జి బదిలీ



ఖలీల్‌వాడి : నిజామాబాద్ రెండో అదనపు జిల్లా జడ్జి పంచాక్షరిని బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ అదనపు జిల్లా జడ్జిగా నియమించారు. 2021 ఆగస్టులో నిజామాబాద్‌లో అదనపు జిల్లాజడ్జిగా ఆయన నియమితులయ్యారు. పంచాక్షరి స్థానంలో శ్రీనివాస్‌ను అదనపు జిల్లా జడ్జిగా నియమించారు. బదిలీ నేపథ్యంలో ఆయనను బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్ కుమార్ సుబేదార్, న్యాయవాదులు ఆశ నారాయణ సన్మానించారు.

డీజీపీతో వీసీలో పాల్గొన్న జిల్లా పోలీసులు



ఖలీల్‌వాడి: రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నిజామాబాద్ పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ యాక్టు అమలు, వాటి విధానాలు, ఫంక్షనల్ వర్టికల్ పనితీరు విధానం, రైతు ఆత్మహత్యల విషయంలో ఆత్మహత్యకు గల సరైన కారణాలు తదితర అంశాలపై రాష్ట్ర స్పెషల్ జీపీ(ప్రభుత్వ ప్లీడర్) ముజీబ్ ద్వారా పోలీసులకు సూచనలు చేశారు. ఇతర దేశాల నుంచి వచ్చేవారు వీసా కండీషన్లు పాటించేటట్లు స్పెషల్ బ్రాంచ్ వారికి ఆదేశాలు జారీచేశారు. జిల్లాస్థాయిలో గల పోలీస్ శిక్షణ కేంద్రాలను త్వరితగతిన చక్కగా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో సీపీ నాగరాజు, స్పెషల్ బ్రాంచ్, ట్రాఫిక్ ఏసీపీలు వెంకటేశ్వర్, ప్రభాకర్ రావు, కిరణ్ కుమార్, మధుసూదన్‌రావు, నారాయణ, ఏవో శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, మక్సూద్ హైమద్, గోవింద్, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, సీఐలు, ఎస్సైలు, ఐటీ ఇన్‌స్పెక్టర్ ముఖీద్ పాషా, సీసీఆర్‌బీ ఎస్సై చాందయ్య, కమ్యూనికేషన్స్ సీఐ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

జూడో టోర్నీకి జిల్లా విద్యార్థులు



నిజామాబాద్ సిటీ: కరీంనగర్ జిల్లా మానేరులో ఈనెల 7, 8వ తేదీల్లో జరుగనున్న రాష్ట్రస్థాయి జూడో పోటీలకు నిజామాబాద్ ఎస్ఆర్ ప్రైమ్ విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల జోనల్ ఇన్‌చార్జి ప్రణీత్‌కుమార్ పేర్కొన్నారు. ఈనెల 3న జిల్లాస్థాయి జూడో పోటీలు జరగగా ఎస్ఆర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పాఠశాల ప్రిన్సిపల్ ఇషాక్ అహ్మద్, వైస్ ప్రిన్సిపల్ ప్రత్యేష, కోచ్ గంగామురళి, పీఈటీలు సుజాత, బాలకిషన్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



అమ్మంటే తనువిచ్చిన దైవం.. భార్యంటే తనువున సగభాగం.. అన్నారో సినీ గేయ రచయిత. నవమాసాలు మోసి తల్లి జన్మనిస్తే.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న భర్తకు తన అవయవాన్ని ఇవ్వడానికీ వెనుకాడడం లేదు. జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు తమ జీవిత భాగస్వాముల ప్రాణాలను కాపాడుకునేందుకు కిడ్నీలు ఇచ్చి ఆదర్శంగా నిలిచారు. – సాక్షి, కామారెడ్డి

తనువున సగభాగం!

- జీవిత భాగస్వామిని కాపాడుకునేందుకు అవయవ దానం
- ఆదర్శంగా నిలుస్తున్న అర్ధాంగులు

Sunday Special

సాఫీగా సాగిపోతున్న జీవితంలో ఒక్కసారిగా అలజడి.. కుటుంబ పెద్ద మూత్ర పిండాలు(కిడ్నీ) దెబ్బతిన్నాయి.. రెండు కిడ్నీలూ పనికిరాకుండా పోవడంతో జీవితంపై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి.. బతకాలంటే కిడ్నీ మార్పిడి చేసి తీరాల్సిందే.. అయితే అందుకు ముందుకు వచ్చేదెవరు? అవయవ దానానికి సిద్ధపడేదెవరు? కానీ మూత్ర పిండాలు దెబ్బతిని రోజురోజుకూ కృంగిపోతున్న ఇంటి పెద్దను కాపాడుకునేందుకు జీవిత భాగస్వామి త్యాగానికి సిద్ధమవుతోంది. తన ప్రాణాలను పణంగా పెట్టి అయినా కట్టుకున్న భర్త ప్రాణాలు నిలపడానికి వెనుకంజ వేయడం లేదు. కామారెడ్డి జిల్లాలో ఇద్దరు మహిళలు తమ భర్తల ప్రాణాలను నిలిపేందుకు త్యాగాలకు సిద్ధపడి తమ కిడ్నీలు ఇచ్చి వారిలో సగ'భాగం అయ్యారు.



కామారెడ్డికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎస్.సత్యం నాలుగేళ్ల క్రితం అనారోగ్యం పాలై ఆస్పత్రులకు వెళ్లాడు. వైద్యులు పరీక్షలు చేసి కిడ్నీ సమస్య అని తేల్చారు. 2020 ఆగస్టులో డయాలిసిస్ మొదలైంది. రెండేళ్లపాటు క్రమం తప్పకుండా ఈ ప్రక్రియ సాగింది. రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయని తేల్చిన వైద్యులు.. కిడ్నీ మార్పిడి జరగాల్సిందేనన్నారు. తన కిడ్నీ ఇవ్వడానికి ఆయన జీవిత భాగస్వామి శైలజ ముందుకొచ్చింది. గతేడాది అక్టోబర్ 31న కిడ్నీ మార్పిడి జరిగింది. ఇద్దరూ కోలుకుంటున్నారు. శైలజ తన కిడ్నీ ఇచ్చి భర్త ప్రాణాలను కాపాడుకుంది. ఈ సందర్భంగా సత్యం 'సాక్షి'తో మాట్లాడుతూ.. కొత్త జీవితాన్ని ప్రసాదించిన తన భార్య శైలజ రుణం తీర్చుకోలేనిదని పేర్కొన్నారు.



భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లికి చెందిన బాణాల అమృతరెడ్డికి మూడేళ్ల క్రితం మూత్రపిండాలు దెబ్బతిన్నాయి. వైద్యం కోసం హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రుల చుట్టూ తిరిగారు. కిడ్నీ మార్పిడి అవసరమని వైద్యులు చెప్పారు. అమృతరెడ్డి భార్య సువర్ణ తన కిడ్నీ ఇవ్వడానికి ముందుకు వచ్చింది. దీంతో గతేడాది కిడ్నీ మార్పిడి చేశారు. పూర్తిగా బెడ్‌రెస్ట్ అవసరం అని వైద్యులు చెప్పడంతో హైదరాబాద్‌లో కూతురి వద్ద ఉంటున్నారు. తనకు కిడ్నీ ఇచ్చి మరుజన్మనిచ్చిన భార్య సువర్ణకు కృతజ్ఞతలు తెలిపారు అమృతరెడ్డి.

గోదావరిలో మొసళ్లు!



- తరచూ బయట పడుతున్న ఉభయ చరాల ఉనికి
- నదికి పుణ్య స్నానాలకు వెళ్తున్న భక్తుల్లో కలవరం

బాల్కొండ : శ్రీ రాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన గోదావరిలో మొసళ్ల సంచారం పెరిగింది. శుక్రవారం పుష్కర ఘాట్ వద్ద పెద్ద మొసలి కనిపించడంతో పుణ్య స్నానాల కు వెళ్లిన భక్తులు ఒక్క సారిగా బెంబేలెత్తిపోయారు. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరదలు వచ్చినప్పుడు నీటి ప్రవాహంలో మొసళ్లు కొట్టుకు వచ్చి ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. కాగా మొసళ్ల ఉనికితో నదికి వచ్చే భక్తులతో పాటు జీవనోపాధి కోసం చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకే పలు గ్రామాల్లోని చెరువుల్లో మొసళ్లు కనిపించాయి. దీంతో కొన్ని చెరువుల్లో ఇప్పటికీ మత్స్యకారులు చేపలు పట్టడం లేదు. ముప్కాల్ మండల నల్లూర్ ఊర చెరువులో రెండు పెద్ద మొసళ్లు గత ఏడాది నుంచి సంచరిస్తున్నాయి. మెండోరా మండలం బుస్సాపూర్ ఊర చెరువులో రెండు మొసళ్లు ఉండగా ఒక మొసలిని ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. రెండో మొసలి గురించి ఇప్పటికీ పత్తాలేదు. ముప్కాల్ మండలం వెంచిర్యాల్ వద్ద కాకతీయ కాలువ పక్కన గల చిన్న చెరువులో మొసలి ఉండటంతో అధికారులు పట్టుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ఇలా మొసళ్లు అప్పుడప్పుడూ బయటపడుతూ స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. తాజాగా గోదావరిలోని స్నానాల ఘాట్ వద్ద మొసలి కనిపించడం జిల్లాలో చర్చనీయాంశమైంది.



గోదావరిలో పుష్కర్‌ఘాట్ వద్ద కనిపించిన మొసలి (ఫైల్)

ఉన్నతాధికారుల ఆదేశానుసారం

ఉన్నతాధికారుల ఆదేశానుసారం మొసళ్లను గోదావరిలో వదిలి పెడుతున్నాం. గోదావరిలో నీటిలోనే మొసలి ఉంటుంది. సేద తీరడం కోసం ఒడ్డుకు వస్తుంటుంది. అలా వచ్చిన మొసలిని పట్టుకుని మళ్లీ నీరు అధికంగా ఉన్న ప్రాంతంలో వదిలేస్తున్నాం. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటాం. – గణేశ్, సెక్షన్ ఆఫీసర్, మెండోరా

చెరువుల్లో పట్టి నదిలో వదిలి..



దూదిగాం వద్ద గోదావరిలో ఫారెస్టు అధికారులు వదిలిన మొసలి (ఫైల్)

చెరువుల్లో పట్టుకున్న మొసళ్లను ఫారెస్టు అధికారులు ఎస్సారెస్పీ దిగువన గోదావరిలో వదులు తున్నారు. మెండోరా మండలం బుస్సాపూర్ చెరువులో మే నెలలో జాలరుల వలకు చిక్కిన మొసలిని దూదిగాం శివారులోని గోదావరిలో వదిలి వేశారు. ఆ సమయంలో నదిలో నీరు కూడా లేదు. అలా వదిలేస్తే గోదావరికి పుణ్య స్నానాల కోసం వచ్చే భక్తుల పరిస్థితి ఏంటని పలువురు నిరసన వ్యక్తం చేశారు. రెండేళ్ల క్రితం దూదిగాం శివారులో జాతీయ రహదారి 44 పైకి పెద్ద మొసలి వచ్చి నానా హంగామా చేసింది. ఫారెస్ట్ అధికారులు ఎక్కడెక్కడో చెరువుల్లో దొరికిన మొసళ్లను పట్టుకు వచ్చి గోదావరిలో వదిలి వేస్తున్నారని, తిరిగి అవే మొసళ్లు చెరువుల్లోకి వచ్చి చేరుతున్నాయని గ్రామీణులు ఆరోపిస్తున్నారు. ప్రతి శుక్ర సోమవారాల్లో గోదావరిలోకి స్నానానికి భక్తులు, నిత్యం బట్టలు ఉతుక్కోవడానికి గ్రామస్తులు వెళ్తుంటారు. మొసళ్ల వలన ప్రమాదాల భారిన పడితే ఎవరు దిక్కు అని ప్రశ్నిస్తున్నారు. పట్టుకున్న మొసళ్లను జంతు ప్రదర్శన శాలకో, జంతువుల పెంపకం ప్రదేశాలకో పంపించాలని కోరుతున్నారు.

రేషన్‌షాపులపై దృష్టి సారించాలి

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సుభాష్‌నగర్: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు సబ్సిడీపై నిత్యావసర సరుకులు అందిస్తున్న రేషన్ దుకాణాల నిర్వహణ తీరును పకడ్బందీగా పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో రేషన్‌డీలర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి రేషన్ షాపులో బోర్డు, సరుకుల స్టాక్ వివరాలు ప్రదర్శించాలన్నారు. రేషన్ కేటాయింపులు, వాటి పంపిణీకి సంబంధించిన వివరాలను నిర్ణీత నమూనాలో రిజిస్టర్‌లలో నమోదు చేయడం, ఫిర్యాదుల పెట్టె, ఈ–పాస్ యంత్రాల ఆధారంగా సరుకుల పంపిణీ, క్యూ లైన్ పద్ధతి తదితర ప్రక్రియలు పక్కాగా జరిగేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో విరివిగా రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో ఏవైనా లోటుపాట్లు, తప్పిదాలను గుర్తిస్తే, తగిన ఆధారాలతో నివేదిక సమర్పించాలని సూచించారు. అక్రమాలకు పాల్పడే వారిని ఎంతమాత్రం ఉపేక్షించకూడదని, అదే సమయంలో నిజాయితీగా పనిచేసే వారిని ప్రోత్సహించాలన్నారు. మోడల్ రేషన్ దుకాణాల కోసం అనువుగా ఉన్న రేషన్ షాపుల జాబితా అందించాలని అధికారులకు సూచించారు. కాగా ధాన్యం సేకరణ ప్రక్రియకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రేషన్ డీలర్లు గన్నీ బ్యాగులు తిరిగి వాపస్ చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జీలు నిర్దేశిత కేటాయింపులకు అనుగుణంగా రేషన్‌డీలర్ల వద్ద నుంచి గన్నీ బ్యాగులు వెనక్కి తీసుకోవాలని ఆదేశించారు. ఈమేరకు రేషన్ డీలర్లు పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో చంద్రప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

భూమి మత్స్య శాఖదే..

- హైకోర్టులో వాదన వినిపించిన ఫిషరీష్ ఏడీ రాజనర్సయ్య

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): నగరంలోని అర్సపల్లిలో గల ప్రభుత్వ భూమి ముమ్మాటికీ మత్స్య శాఖదేనని జిల్లా ఫిషరీష్ డిపార్ట్‌మెంట్ ఏడీ రాజనర్సయ్య హైకోర్టు ముందు వాదన వినిపించారు. బలమైన సాక్ష్యాలున్నందున పరిశీలించి పూర్తి స్థలాన్ని మత్స్య శాఖ పేరుపై 'ధరణి'లోకి ఎక్కించాలని కోర్టును కోరారు. ధరణిలో నమోదుకు జిల్లా కలెక్టర్, సౌత్ తహశీల్దార్‌కు డైరెక్షన్ ఇవ్వాలని గంగపుత్ర అభివృద్ధి కమిటీ సభ్యులు కూడా కోర్టును కోరారు. అర్సపల్లిలో సర్వే నంబర్లు 2848, 2849లలో 4.24 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అయితే, ఇందులో 1.28 ఎకరాలు మాత్రమే మత్స్యశాఖ పేరుపై ఉండడం, మిగతా 2.96 ఎకరాలు ఆరుగురు ప్రైవేటు వ్యక్తుల పేర్లపై ఉండడంతో గంగపుత్ర అభివృద్ధి కమిటీ నిజామాబాద్ ఆధ్వర్యంలో కోర్టులో కేసు వేసిన సంగతి తెలిసిందే. వారం రోజుల క్రితం వాదనలు విన్న కోర్టు మత్స్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, కమిషనర్, అలాగే జిల్లా కలెక్టర్, సౌత్ తహశీల్దార్, మత్స్య శాఖ ఏడీని కేసులో చేర్చింది. కలెక్టర్ తరపున మత్స్య శాఖ ఏడీ కోర్టులో వాదనలు వినించారు. అయితే, ఈ నెల 6వ తేదీన కోర్టు మరోసారి విచారించనుంది.



మత్తు గుండ్లను ప్రయోగించి..

భిక్కనూరు మండలంలో సంచరిస్తున్న ఎలుగుబంటిని అటవీ శాఖ అధికారులు మత్తు మందు ఉన్న మందు గుండ్లను ప్రయోగించి పట్టుకున్నారు. ఇందుకోసం 11 గంటలపాటు శ్రమించారు. పట్టుకున్న ఎలుగుబంటిని వరంగల్‌లోని జూ పార్క్‌కు తరలించారు.

-వివరాలు 10లో..

బదిలీల ప్రక్రియను పరిశీలించిన జేడీ



నిజామాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖలో బదిలీల ప్రక్రియను శనివారం జాయింట్ డైరెక్టర్ అబ్జర్వర్ ఉషారాణి పరిశీలించారు. దరఖాస్తుదారులు, అర్హతలు ఆన్‌లైన్ విధానంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిబంధన ప్రకారం బదిలీల ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఆమె వెంట డీఈవో దుర్గాప్రసాద్ ఉన్నారు.

మరాఠ్వాడ గడ్డమీద..



నాందేడ్ సభావేదిక ముందు జనం కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు

నేడు నాందేడ్‌లో బీఆర్ఎస్ సభ

- పొరుగు రాష్ట్రంలో పార్టీ విస్తరణపై దృష్టి
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లాకు చెందిన నాయకులు

బోధన్: బీఆర్ఎస్ విస్తరణకు ఆ పార్టీ అడుగులు వేస్తోంది. జిల్లాకు పొరుగున ఉన్న మహారాష్ట్రలో పార్టీ విస్తరణపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా నాందేడ్ జిల్లా కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు ఇప్పటికే అక్కడికి చేరుకున్నారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, రాష్ట్ర మహిళా కమి షన్ చైర్మన్ ఆకుల లలిత, రాష్ట్ర ప్రతినిధి రాంకిషన్‌రావులతో పాటు నిజామాబాద్ అర్బన్, బోధన్‌కు చెందిన పార్టీ నాయకులు అక్కడే మకాం వేశారు. వారం నుంచి సభ ఏర్పాట్లకు సంబంధించిన ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

సభా ప్రాంగణంలో ఏర్పాట్లు

నాందేడ్ జిల్లా కేంద్రంలో గురుగోవింద్ సింగ్ గురుద్వార్ సచ్‌ఖండ్ మైదానంలో ఆదివారం నిర్వహించనున్న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు పూరయ్యాయి. సభావేదిక పరిసరాల్లో బీఆర్ఎస్ గులాబీ జెండాలు, భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన వివిధ పార్టీల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరేందుకు ఏర్పాట్లు చేశారు.

భారీ జనసమీకరణకు యత్నాలు

నాందేడ్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సభకు భారీ స్థాయి జనసమీకరణపై బీఆర్ఎస్ నేతలు దృష్టిసారించారు. నాందేడ్ జిల్లాలోని ధర్మాబాద్, దెగ్లూర్, కొండల్‌వాడి, నర్సి, నాయగావ్, హింగోలి, బోకర్ ప్రాంతాల నుంచి జనసమీకరణ జరుగుతోంది. సరిహద్దులో ఉన్న నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి బీఆర్ఎస్ మండల, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు, నాయకులు, ముఖ్య కార్యకర్తలను నాందేడ్ సభకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

బహిరంగసభకు తరలిరావాలి : జెడ్పీ చైర్మన్

నిజామాబాద్‌నాగారం: సీఎం కేసీఆర్ నాందేడ్ సభకు కార్యకర్తలు తరలిరావాలని జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు పేర్కొన్నారు. శనివారం ధర్మాబాద్‌లో జెడ్పీ చైర్మన్ సమక్షంలో 50 కుటుంబాల సభ్యులు బీఆర్ఎస్‌లో చేరారు. చైర్మన్ మాట్లాడుతూ.. సభకు కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలన్నారు.

తాగిన మత్తులో ప్రాజెక్టులోకి దూకిన యువకుడు

- ప్రాణాలు కాపాడిన ముగ్గురు



ఇనుపరాడ్‌ను పట్టుకున్న సతీశ్, కాపాడుతున్న యువకుడు, సతీశ్‌ను చూసి రోదిస్తున్న భార్య

నిజాంసాగర్ (జుక్కల్): మద్యం సేవించిన మత్తులో ఆత్మహత్య చేసుకునేందుకు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి దూకిన వ్యక్తిని అదే సమయంలో అటుగా వెళ్తున్న యువకులు రక్షించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా మాసన్ పల్లి గ్రామానికి చెందిన దేవళ్ల సతీశ్ (38) కుటుంబ కలహాలతో చిత్తుగా మద్యం సేవించాడు. జీవితంపై విరక్తి చెందడంతో బైక్‌పై శనివారం ఉదయం నిజాంసాగర్ ప్రాజెక్టు చేరుకున్నాడు. గణపతి ఆలయం సమీపాన అచ్చంపేట స్లూయిస్ వద్ద బైక్‌ను పార్కింగ్ చేసి ప్రాజెక్టులోకి దూకాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న అచ్చంపేటకు చెందిన యువకులు చాకలి సందీప్ కుమార్, ధన్‌రాజ్, గూల రాజు నీటిలో మునుగుతున్న సతీశ్‌ను చూసి డిష్‌వైర్‌ను ప్రాజెక్టులోకి విసిరారు. సతీశ్ దాన్ని గట్టిగా పట్టుకున్నాడు. యువకులు వైర్‌ను లాగి అచ్చంపేట స్లూయిస్‌రాడ్ దగ్గరకు సతీశ్ వచ్చేలా చేశారు. అక్కడ తూముపై నిలబడి సతీశ్ రాడ్‌ను పట్టుకున్నారు. అనంతరం గూల రాజు తెప్ప సహాయంతో ప్రాజెక్టు నీటిలోకి వెళ్లి సతీశ్ చాతీకి వైరు కట్టి ఒడ్డుకు చేర్చాడు. అప్పటికే నీటమునిగి నీళ్లు మింగి అపస్మారక స్థితిలోకి చేరుకున్న సతీశ్‌కు సపర్యలు చేశారు. అనంతరం గుర్తింపు కార్డు ఆధారంగా సతీశ్ కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఏఎస్సై నాగరాజు అక్కడి చేరుకుని సతీశ్‌ను చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. యువకులు సకాలంలో స్పందించి సతీశ్ ప్రాణాలను కాపాడటంతో వారి సాహసానికి అభినందించారు.

క్లుప్తంగా

ట్రాన్స్‌కో ఉద్యోగి బ్రెయిన్‌డెడ్

• అవయవాలు దానం చేసిన కుటుంబ సభ్యులు


ఉమాశంకర్‌గౌడ్‌(ఫైల్‌)

తాడ్వాయి: మండలంలోని ఎర్రాపహాడ్‌ గ్రామానికి చెందిన ట్రాన్స్‌కో ఉద్యోగి ఉమా శంకర్‌గౌడ్‌(34) బ్రెయిన్‌ డెడ్‌ అయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఉమాశంకర్‌ ప్రస్తుతం బిచ్కుందలో జూనియర్‌ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ఆయనను నాలుగు రోజుల క్రితం కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ నయం కాకపోవడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స చేస్తుండగా ఆయన బ్రెయిన్‌ డెడ్‌ కావడంతో శనివారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. దీంతో ఆయన అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మృతుడికి భార్య సంగీత, కుమారుడు కార్తీక్‌గౌడ్‌, కూతురు సహస్ర ఉన్నారు.

11 నుంచి టీసీసీ పరీక్షలు

నిజామాబాద్‌ అర్బన్‌: టెక్నికల్‌ కోర్సు పరీక్షలు ఈ నెల 11 నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌ ఒక ప్రకటన తెలిపారు. 14 వరకు పరీక్షలు ఉంటాయని, హాల్‌ టికెట్లను వెబ్‌సైట్‌ నుంచి డౌన్‌లోడ్‌ చేసుకోవాలన్నారు.

డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో ఇద్దరికి జైలు

లింగంపేట: డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో శనివారం ఇద్దరికి జైలు శిక్ష పడినట్లు ఎస్సై శంకర్‌ తెలిపారు. లింగంపేట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో డ్రంకన్‌ డ్రైవ్‌ తనిఖీలు చేస్తుండగా మండలంలోని పర్మళ్ల గ్రామానికి చెందిన గంట రాములు, నాగిరెడ్డిపేట మండలం బొల్లారం గ్రామానికి చెందిన ఒడ్డె రాజు మద్యం తాగి వాహనాలు నడుపుతూ దొరికారు. వీరికి ఎల్లారెడ్డి సెకండ్‌ క్లాస్‌ మేజిస్ట్రేట్‌ రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చూడాలి



ఇందల్వాయి : మండలంలోని మల్లాపూర్‌లో గువ్వగుట్ట వద్ద సర్వే. 263లో ఉన్న మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామ వీడీసీ సభ్యులు తహశీల్దార్‌కు విన్నవించారు. ఈ విషయంపై చర్యలు చేపట్టి సదరు భూమి కబ్జాకు గురి కాకుండా సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేయాలని శనివారం డీటీ చందనకు సర్పంచ్‌ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు.

నందిపేట పీహెచ్‌సీ పరిశీలన



నందిపేట్‌(ఆర్మూర్‌): నందిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్‌ పరిశీలించారు. ఈసందర్భంగా పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలలో నమోదయిన మలేరియా కేసుల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి సిబ్బందితో రివ్యూ సమావేశం ఏర్పాటు చేసి, మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు.

ఇరుకు గదుల్లో ఇక్కట్లు

• దోమకొండ ఐసీడీఎస్‌ పరిధిలో ఐదు మండలాలు
• రెండు గదుల్లో కొనసాగుతున్న కార్యాలయం
• చెట్ల కింద సమావేశాలు నిర్వహిస్తున్న వైనం
• ఇబ్బందులు పడుతున్న అంగన్‌వాడీ టీచర్లు


దోమకొండలోని ఐసీడీఎస్‌ కార్యాలయం


సమావేశాలకు వచ్చి చెట్ల కిందే నిల్చున్న అంగన్‌వాడీలు

దోమకొండ: గ్రామాల నుంచి సమావేశాల కోసం కార్యాలయానికి వచ్చిన అంగన్‌వాడీ టీచర్లు కనీసం సేద తీరటానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. దోమకొండ ఐసీడీఎస్‌ కార్యాలయంలో రెండు చిన్న గదుల్లో కొనసాగుతుండటంతో చెట్ల కిందే సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. ఈ భవనాన్ని మూప్పై ఏళ్ల క్రితం నిర్మించారు. కార్యాలయం దోమకొండతో పాటు భిక్కనూరు, మాచారెడ్డి, బీబీపేట, రాజంపేట మండలాల పరిధి కింద ఉన్న అంగన్‌వాడీ సెంటర్లకు కేంద్రంగా ఉంటుంది. దీని పరిధిలో ఐదు మండలాల్లో మొత్తం 238 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 210 మెయిన్‌ కేంద్రాలు కాగా, మరో 28 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కార్యాలయంలో స్థలం సరిపోకపోవడంతో చెట్ల కిందనే సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత కార్యాలయం సిబ్బందికే సరిపోవడం లేదని అంగన్‌వాడీ టీచర్లు అంటున్నారు. స్థాయికి దగ్గట్టుగా ఐసీడీఎస్‌కు నూతన భవనం నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని నూతన భవనం నిర్మించాలని అంగన్‌వాడీ సిబ్బంది, టీచర్లు కోరుతున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

కార్యాలయంలో సిబ్బంది కొరత కూడా వేధిస్తుంది. సీడీపీవోతో పాటు, ఐదుగురు గ్రేడ్‌–1 సూపర్‌వైజర్‌లు, మరో ఐదుగురు గ్రేడ్‌–2 సూపర్‌వైజర్‌లు ఉండాలి. కాని గ్రేడ్‌–1 సూపర్‌వైజర్‌ పోస్టులు మూడు ఖాళీగా ఉన్నాయి. టైపిస్టు పోస్టు ఖాళీగానే ఉంది. 12 మంది అంగన్‌వాడీ టీచర్లతో పాటు, 7 ఆయా పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

సమావేశాలకు ఇబ్బందిగా ఉంది



దోమకొండ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్ల సమావేశాలకు కార్యాలయం చిన్నదిగా ఉండి బయట నిర్వహించాల్సి వస్తుంది. కార్యాలయం పక్కనే బీసీ హాస్టల్‌ ఉంది. దీంతో హాస్టల్‌లో సమావేశాలు నిర్వహిస్తున్నాం. నూతన భవనం నిర్మిస్తే బాగుంటుంది.
– రోశమ్మ, ఐసీడీఎస్‌ సీడీపీవో, దోమకొండ

చెట్ల కింద ఉంటున్నాం



సమావేశాలకు ఐసీడీఎస్‌ కార్యాలయానికి వస్తే ఎండలో ఉంటున్నాము. చెట్ల కింద నిల్చుంటున్నాము. చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలి. అదేవిధంగా కార్యాలయంలో సిబ్బందిని నియమించాలి.
– మీనా, అంగన్‌వాడీ టీచర్‌, దోమకొండ

ధర్మాన్ని రక్షించాలి

• శ్రీవిల్లిపుత్తూర్‌ శ్రీరామచంద్ర జీయర్‌ స్వామీజీ
• డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం సందర్శన
• ఘనంగా శ్రీసీతారామచంద్రస్వామి గరుడసేవ


గరుడ వాహనంపై శ్రీసీతారామచంద్ర స్వామి

డిచ్‌పల్లి: ధర్మాన్ని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని, శ్రీసీతారామచంద్రస్వామి దీక్షానగరం (ఖిల్లా డిచ్‌పల్లి)లో వెలిశాడంటే ఇది వేదభూమి అని భక్తులు నిత్యం రామనామ జపం చేయడంతో లోక కల్యాణం జరుగుతుందని శ్రీమాన్‌ పరమహంస పరివ్రాజకులు శ్రీ విల్లిపుత్తూర్‌ రామచంద్రజీయర్‌ స్వామీజీ అన్నారు. శనివారం డిచ్‌పల్లి ఖిల్లా రామాలయాన్ని ఆయన సందర్శించారు. స్వామీజీకి ప్రధానార్చకులు సుమిత్‌శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. జీయర్‌ స్వామి శ్రీసీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులను ఆశీర్వదించారు. అనంతరం గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామీజీని సత్కరించారు.

ఘనంగా గరుడ సేవ

ఖిల్లా రామాలయంలో జరుగుతున్న తిరుక్కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం హోమం, సదస్యం, సాయంత్రం గరుడ సేవ నిర్వహించినట్లు అర్చకులు సుమిత్‌శర్మ దేశ్‌పాండే తెలిపారు. గరుడ వాహనంపై శ్రీసీతారామ లక్ష్మణ సమేత హనుమంతుడి ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు.

నేడు రథోత్సవం

ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. రథాన్ని అందంగా అలంకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాత్రి 8గంటలకు ప్రారంభమయ్యే ఈ ఉత్సవానికి జిల్లా నలమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారని ఆలయ కమిటీ చైర్మన్‌ పొద్దుటూరి మహేందర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్‌, సర్పంచ్‌ గడ్డం రాధకిష్టారెడ్డి, సొసైటీ చైర్మన్‌ గజవాడ జైపాల్‌ తెలిపారు.


ఖిల్లా రామాలయం వద్ద మాట్లాడుతున్న రామచంద్రజీయర్‌ స్వామీజీ

11న జిల్లా వ్యాప్తంగా లోక్‌ అదాలత్‌లు



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్‌రావు

ఖలీల్‌వాడి: జిల్లావ్యాప్తంగా ఈ నెల 11న లోక్‌ అదాలత్‌లను నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్‌ మొదటి అదనపు జిల్లాజడ్జి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవ సదన్‌లో వివిధ పోలీస్‌ స్టేషన్‌లోని అధికారులతో లోక్‌ అదాలత్‌ సన్నాహక సమావేశంలో నిర్వహించారు. క్రిమినల్‌ నేరాల్లోని ఫిర్యాదుదారులను, బాధితులను ఒక వేదిక మీదకు తీసుకురావాలని పేర్కొన్నారు. రాజీ పడదగిన అన్ని రకాల క్రిమినల్‌ కేసులు, సివిల్‌ దావాలు లోక్‌ అదాలత్‌లో పరిష్కరించుకునే వీలు ఉంటుందని చెప్పారు. నిజామాబాద్‌, ఆర్మూర్‌, బోధన్‌ న్యాయస్థానాల్లో నిర్వహిస్తున్న జాతీయ లోక్‌ అదాలత్‌కు ఏర్పాట్లు చేశామని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి తెలిపారు. జిల్లా పోలీసు యంత్రాంగం లోక్‌అదాలత్‌కు సహకరిస్తుందని నిజామాబాద్‌ ఏసీపీ వెంకటేశ్వర్‌ తెలిపారు. సమావేశంలో నిజామాబాద్‌ రెండో అదనపు జిల్లాజడ్జి పంచాక్షరీ, జూనియర్‌ సివిల్‌ జడ్జిలు సౌందర్య, భవ్య, గిరిజ, పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రవిరాజ్‌, డిప్యూటీ డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూటర్‌ లక్ష్మినర్సయ్య, అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ మహమ్మద్‌ రహీమోద్దీన్‌, భూసారపు రాజేష్‌ పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం నేర విచారణ చేపట్టాలి


మాట్లాడుతున్న లక్ష్మీనర్సయ్య

ఖలీల్‌వాడి: కేసులో ప్రాథమిక విచారణ నివేదిక పూర్తి చేసిన తర్వాత నివేదికను రూపొందించుకొని ప్రణాళిక ప్రకారం నేర విచారణ చేపట్టాలని డిప్యూటీ డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ లక్ష్మీనర్సయ్య అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవ సదన్‌లో పోలీస్‌ అధికారులకు 'నేర విచారణ, సాక్ష్యాల సేకరణ, బాధితుల వాంగ్మూలాల నమోదు, నూతన పద్ధతుల వినియోగం' అనే అంశాలపై అవగాహన కల్పించారు. నేర న్యాయ విచారణకు కోర్టులో సాక్ష్యం ఇవ్వడానికి వచ్చే ప్రతి సాక్షికి ముందస్తుగా కేసు వివరాలు తెలుపుతారని, నేరాలలో ముద్దాయిలు ఉపయోగించిన వస్తువులను స్వాధీనం చేసుకునే క్రమంలో నిర్లిప్తత పాటించరాదన్నారు. అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు మహమ్మద్‌ రహీమోద్దీన్‌, భూసారపు రాజేష్‌ ఉన్నారు.

ప్రైవేటు డిగ్రీ కాలేజీల అసోసియేషన్‌ ఎన్నిక



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాలలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్‌పీఆర్‌ డిగ్రీ కాలేజీలో అసోసియేషన్‌ పూర్వకమిటీ సభ్యులు, రెండు జిల్లాల ప్రైవేటు డిగ్రీ కళాశాలల యజమానులు పాల్గొని 2023–25కి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంబోజీ హరిప్రసాద్‌ (ఎస్‌వీ డిగ్రీ కాలేజీ), ప్రధాన కార్యదర్శిగా సంజీవ్‌ సీతారాం (విజేత డిగ్రీ కాలేజీ), కోశాధికారిగా ఏ దత్తాద్రి (ఎస్‌ఆర్‌కే డిగ్రీ కాలేజీ), అసోసియేట్‌ అధ్యక్షుడిగా వి శ్రీనివాస్‌రెడ్డి (ఎస్‌ఎస్‌ఎల్‌ డిగ్రీ కాలేజీ) ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన నరాల సుధాకర్‌ (కేర్‌ డిగ్రీ కాలేజీ), హరిష్మణ్‌రెడ్డి (సాందీపని డిగ్రీ కాలేజీ), ఓ శ్రీనివాస్‌రాజు (నిమ్స్‌ డిగ్రీ కాలేజీ), యూ మల్లికార్జున్‌ (సాయిశ్రీ డిగ్రీ కాలేజీ) నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు.

ఆలయంలో హుండీ చోరీ

రుద్రూర్‌: మండల కేంద్రంలోని శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలోని హుండీని శుక్రవారం రాత్రి గుర్తు తెలియన వ్యక్తులు పగులగొట్టి అందులోని డబ్బులు ఎత్తుకెళ్లారు. శనివారం ఆలయానికి వచ్చిన పూజారి చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గతంలో రెండు సార్లు ఇదే ఆలయంలో హుండీని చోరీ చేసినట్లు భక్తులు తెలిపారు.

జాతీయ సీనియర్‌ సాఫ్ట్‌బాల్‌ పోటీలకు జిల్లా క్రీడాకారులు


క్రీడాకారులతో అసోసియేషన్‌ ప్రతినిధులు

డిచ్‌పల్లి: ఒడిశా రాష్ట్రం పూరి నగరంలో ఈ నెల 5 నుంచి 9వరకు జరగనున్న 44వ సీనియర్‌ జాతీయ సాఫ్ట్‌బాల్‌ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు శనివారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా సాఫ్ట్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు వి ప్రభాకర్‌రెడ్డి, ఎం గంగమోహన్‌ మాట్లాడుతూ.. జిల్లా నుంచి ఎక్కువ మంది క్రీడాకారులు రాష్ట్ర జట్టుకు ఎంపికై జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి వెళ్తుండటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల స్పోర్ట్స్‌ కో–ఆర్డినేటర్‌ నీరజరెడ్డి, జిల్లా సాఫ్ట్‌బాల్‌ అసోసియేషన్‌ సంయుక్త కార్యదర్శి మర్కంటి సుజాత, పీఈటీ నల్లూరి లత, కోచ్‌లు నరేష్‌, వేముల మౌనిక పాల్గొన్నారు.

ఎంపికైన జిల్లా క్రీడాకారులు

మహిళల జట్టు: ఎల్‌ రాణి, జె వైశాలి, కె సృజన (సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, సుద్దపల్లి), ఎ ఇందు, ఎ నందిని (సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల పోచంపాడు), ఎస్‌ సౌమ్య, రాణి, ఎల్‌ భూలబాయి (సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల తాడ్వాయి), డి మౌనిక (గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజ్‌, నిజామాబాద్‌)

పురుషుల జట్టు : బి సాయికిరణ్‌ నాయక్‌ (రూప్లా నాయక్‌ తండా), సెంథిల్‌ (సాఫ్ట్‌బాల్‌ అకాడమీ ఆర్మూర్‌).

పండితులు, పీఈటీలకు పదోన్నతులు ఇవ్వాలి


బోధన్‌ అంబేడ్కర్‌ చౌరస్తాలో నినాదాలు చేస్తున్న భాషా పండితులు, పీఈటీలు

బోధన్‌: భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్‌ చేస్తు శనివారం రాత్రి పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్‌ చౌరస్తాలో పండితులు, పీఈటీల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అంబేడ్కర్‌ విగ్రహానికి సమర్పించారు. పదోన్నతుల కోసం తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితులు, పీఈటీలు ఈ నెల 1 న నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల 9, 10 తరగతులకు విద్యాబోధనను బంద్‌ పెట్టి సహాయ నిరాకరణను చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధి పురాణే అజయ్‌ కుమార్‌ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న భాషా పండితులు, పీఈటీలకు 30 ఏళ్లుగా పదోన్నతులు కల్పించడం లేదన్నారు. దీంతో తీవ్ర మానసిక వ్యధను అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో పండితులకు పదోన్నతులు కల్పిస్తామని సీఎం కేసీఆర్‌ ఇచ్చిన హామీ మేరకు జీవో జారీ అయినా అమలుకు నోచుకోలేదన్నారు. జేఏసీ ప్రతినిధులు గోపాల్‌, ప్రకాష్‌, వీరేంద్రకుమార్‌, శ్రీనివాస్‌, అత్తరుద్దీన్‌, సుల్తానా, కాశీనాథ్‌ అప్ప, సుదర్శన్‌, రాములమ్మ పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నందిపేట్‌: మండలంలోని కౌల్‌పూర్‌ గ్రామానికి చెందిన బడావత్‌ భూమన్న (53) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు.. శుక్రవారం సాయంత్రం భూమన్న బైక్‌పై నందిపేటకు బయలుదేరాడు. విజయనగర్‌ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న నందిపేటకు చెందిన మనోజ్‌ అనే వ్యక్తి బైక్‌తో భూమన్నను ఢీకొన్నాడు. దీంతో భూమన్నకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. మృతుడి భార్య రెండేళ్ల క్రితం కరోనాతో మరణించగా, ముగ్గురు కుమారులు కౌల్‌పూర్‌లో నివాసం ఉంటున్నారు. కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో ఒకరు..

నవీపేట: మండలంలోని జన్నెపల్లి శివారులోని వాగులో పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రాజారెడ్డి శనివారం తెలిపారు. మండలంలోని గాంధీనగర్‌ గ్రామానికి చెందిన చెలంచీర్ల వెంకటేశ్వర్‌రావు ఈనెల 1న పొలంలో మందు చల్లుతానని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వాకబు చేయగా ఎలాంటి సమాచారం అందలేదు. శనివారం ఉదయం జన్నెపల్లి శివారులోని వాగులో వెంకటేశ్వర్‌రావు మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

రెంజల్‌: మండలంలోని వీరన్నగుట్ట గ్రామానికి చెందిన జనమ్మ నిజామాబాద్‌లోని జనరల్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతు శనివారం మృతి చెందినట్లు ఎస్సై పండ్ల సాయన్న తెలిపారు. వారం రోజుల క్రితం ఆమెకు ఇంట్లో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె చనిపోయింది.

మృతుడి ఆచూకీ గుర్తింపు

రెంజల్‌: మండలంలోని నీలా శివారులో గల వాగులో శుక్రవారం లభ్యమైన మృతదేహం రుద్రూర్‌కు చెందిన బాబర్‌దిగా గుర్తించినట్లు సమాచారం. కాళ్లు, చేతులకు రాళ్లతో కట్టి వాగులో మృతదేహం లభ్యం కావడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి రుద్రూర్‌ వాసిగా గుర్తించారు. బాబర్‌కు మహారాష్ట్రలోని బిలోలికి చెందిన యువతితో వివాహం జరగ్గా జల్సాలకు అలవాటు పడి జులాయిగా తిరిగేవాడని స్థానికుల ద్వారా తెలిసింది. ఈ నేపథ్యంలో హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు సైతం అనుమానం వ్యక్తం చేయడం లేదని తెలిసింది. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్సై సాయన్న తెలిపారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

మాక్లూర్‌: జీవితంపై విరక్తి చెంది నిజామాబాద్‌లోని మేరు సంఘం ప్రాంతానికి చెందిన శాంత (55) అనే మహిళ మాక్లూర్‌ మండలం కల్లెడి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై యాదగిరిగౌడ్‌ కథనం మేరకు.. శాంత పుట్టినిల్లు కల్లెడి గ్రామం. 30 ఏళ్ల క్రితం నిజామాబాద్‌కు చెందిన దయానంద్‌తో వివాహం జరిగింది. వారికి పిల్లలు లేరు. ఈ విషయమై భర్త పిల్లలు లేని జీవితం ఎందుకు అంటూ తరుచూ వేధించేవాడని తెలిపారు. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురైన శాంత (55) శనివారం ఉదయం కల్లెడి వచ్చింది. పుట్టింటికి వెళ్లకుండానే మార్గ మధ్యలో ఉన్న చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపారు. మృతురాలి అన్న కిషన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఇసుక డంపులు సీజ్‌



లింగంపేట: మండలంలోని శెట్పల్లి గ్రామ శివారులోని పంట చేనుల వద్ద నిల్వ ఉంచిన ఇసుక డంపులను శనివారం ఆర్‌ఐ బాలయ్య సీజ్‌ చేశారు. గ్రామ శివారులోని పెద్దవాగు నుంచి ఇసుకను పంట చేనుల వద్ద డంపు చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు వెళ్లి సీజ్‌ చేసినట్లు తెలిపారు. ఎనిమిది ట్రిప్పుల ఇసుక సీజ్‌ చేశామన్నారు. ఆయన వెంట రెవిన్యూ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి


మాట్లాడుతున్న ఆర్‌ఎల్‌సీ అబ్దుల్‌ బషీర్‌

డిచ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం గురుకుల కళాశాలల ద్వారా అందిస్తున్న ఉచిత బోధన, వసతి సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా ఆర్‌ఎల్‌సీ అబ్దుల్‌ బషీర్‌ అన్నారు. మండలంలోని ఘన్‌పూర్‌ శివారులో గల మైనార్టీ గురుకుల పాఠశాల/కళాశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని ప్రిన్సిపాల్‌ అర్షియా ఎక్బాల్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రయోగశాలలు లేక ఇబ్బందిగా ఉందని ఇంటర్‌ విద్యార్థులు తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్‌ అర్షియా, ఉపాధ్యాయుడు రవి ఉన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలి


పోలీస్‌ స్టేషన్‌ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

సిరికొండ: సిరికొండ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌ సునీతపై చర్యలు తీసుకోవాలని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు డిమాండ్‌ చేశారు. తెలంగాణ చౌరస్తా నుంచి పోలీస్‌ స్టేషన్‌ వరకు ప్లకార్డులు పట్టుకొని విద్యార్థులు శనివారం ర్యాలీ తీశారు. ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చిన్న తప్పుకే పెద్ద పనిష్‌మెంట్‌ ఇస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎండలో గంటల తరబడి నిలబెడతారని, వాతలు వచ్చేలా దండిస్తుందని వారు వాపోయారు. పోలీస్‌ స్టేషన్‌ ఎదుట నినాదాలు చేస్తున్న విద్యార్థులను సిబ్బంది వచ్చి ఎస్సై వద్దకు తీసుకెళ్లారు. పాఠశాలలో జరిగిన ఘటన గురించి విచారణ చేస్తున్నామని ఎస్సై నర్సింలు వారికి చెప్పారు. విద్యార్థులు ఇలా రోడ్లపైకి వచ్చి ఆందోళన చేయవద్దని కేసులు నమోదయితే జీవితాలు పాడవుతాయని హితవు పలికారు. దీంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లారు.